ప్రభ మనం
మనం..మనం.. మనఊరి కోసం
RNI/APTEL/26/A3829
TELUGU DAILY
తెలుగు డైలీ
Gmail: prabhamanam@gmail.com

విలేకరులు కావలెను.
WANTED... WANTED...
ఆంధ్ర, తెలంగాణ నుండి
వెలువడుతున్న తెలుగు జాతీయ దినపత్రిక
ప్రభ మనం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు,
ఆర్సి ఇంచార్జిలు,పిసి ఇంచార్జిలు మరియు మండల
విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్: వి. లింగమూర్తి
9000367833, 8074937223

కర్నూలు : ఎడిటర్ - వడ్డే లింగమూర్తి | సంపుటి : 1 సంచిక : 117 | పేజీలు : 4 | వెల రూ./-4 | email: prabhamanam@gmail.com | శుక్రవారం 18- 09 - 2026

## యూఎస్‌లో ఆగని గన్ కల్చర్.. పార్కు, యూనివర్సిటీలో కాల్పులు

- ★అమెరికాలో మళ్లీ పెరిగిన కాల్పుల ఘటనలు
- ★కెంటకీలోని ఓ పార్కులో జరిగిన కాల్పుల్లో ఒకరు మృతి
- ★నాలుగేళ్ల చిన్నారితో సహా నలుగురికి గాయాలు
- ★వర్జీనియా యూనివర్సిటీలో మరో ఘటన, ఐదుగురికి గాయాలు
- ★కొద్దిరోజుల క్రితం జార్జియా స్కూల్‌లోనూ కాల్పుల ఘటన



అమెరికాలో గన్ కల్చర్ మరోసారి పంజా విసిరింది. నిన్న ఒక్కరోజే కెంటకీ, వర్జీనియా రాష్ట్రాల్లో జరిగిన రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో ఒకరు మరణించగా, చిన్నారులతో సహా తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ వరుస ఘటనలు స్థానికంగా తీవ్ర భయాందోళనలకు కారణమయ్యాయి. - మిగతా 2 లో

## ఒకవైపు సైనిక విన్యాసాలు మరోవైపు కిమ్‌తో స్నేహమంటున్న ట్రంప్

- ●కొరియా ద్వీపకల్పంలో అసలేం జరుగుతోంది!
- ●కిమ్ జాంగ్ ఉన్‌తో తన బంధం గొప్పదంటూ పాత ఫొటోను పంచుకున్న ట్రంప్
- ●అమెరికా-దక్షిణ కొరియా సైనిక విన్యాసాలపై తీవ్రంగా స్పందించిన ఉత్తర కొరియా
- ●ఇది 'అణు కూటమి'గా మారుతోందని, తీవ్రంగా స్పందిస్తామని ప్యాంగ్యాంగ్ వార్నింగ్
- ●కొత్త స్థాయి ముప్పును కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని స్పష్టీకరణ
- ●ఇటీవలే బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించి ఉద్రిక్తతలను పెంచిన ఉత్తర కొరియా



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ మధ్య సంబంధాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. తాజాగా ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో కిమ్‌తో ఉన్న - మిగతా 2 లో

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి
# రంగంలోకి రెవెన్యూ అధికారులు



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది.

- ▶▶కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు
- ▶▶సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా
- ▶▶సర్వే నంబర్లు, పాత రికార్డుల సేకరణ
- ▶▶అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటనతో కదలిక

## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి



- ➤స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు మంత్రి ఉత్తమ్ షరతు
- ➤సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తామని స్పష్టం
- ➤పేదల రేషన్ కార్డుల విషయంలో రాజకీయాలు వద్దని హితవు
- ➤రాష్ట్రం సన్నబియ్యం ఇస్తుంటే, కేంద్రం దొడ్డు బియ్యమే ఇస్తోందని విమర్శ
- ➤ప్రొటోకాల్ ప్రకారం రేషన్ షాపుల్లో ఇప్పటికే ప్రధాని ఫొటో ఉందని వెల్లడి

స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న - మిగతా 2 లో

## ప్రాణం ఉన్నంతవరకు బీఆర్ఎస్‌తో కలవను



- ❖షోకాజు నోటీసు లేకుండానే పార్టీ నుంచి పంపించారని ఆవేదన
- ❖రాబోయే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తామని ధీమా
- ❖బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడతామని ప్రకటన
- ❖కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదని జోస్యం

తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ పార్టీతో - మిగతా 2 లో

## నేను గర్వపడే 'దిమాగీ నక్సల్'ను: మోదీకి చిదంబరం కౌంటర్



- ➤'దిమాగీ నక్సలిజం' దేశానికి కొత్త సవాల్ అన్న ప్రధాని మోదీ
- ➤స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోని వ్యాఖ్యలపై రేగిన దుమారం
- ➤తనను తాను 'దిమాగీ నక్సల్' అని గర్వంగా ప్రకటించుకున్న చిదంబరం
- ➤ప్రధాని నిరాశలో ఉన్నారంటూ విమర్శించిన కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన 'దిమాగీ నక్సలిజం' (మేధోపరమైన - మిగతా 2 లో

## నెహ్రూ, ఇందిరలను దాటేసిన మోదీ
# ఎర్రకోట ప్రసంగాల్లో రికార్డ్

- ▶▶ఎర్రకోట ప్రసంగాల నిడివిలో ప్రధాని మోదీ కొత్త రికార్డు
- ▶▶దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన నలుగురు ప్రధానుల్లో అగ్రస్థానం
- ▶▶13 ప్రసంగాల్లోనే 1177 నిమిషాలు మాట్లాడిన నరేంద్ర మోదీ
- ▶▶నెహ్రూ, ఇందిరాల కన్నా తక్కువ ప్రసంగాలు, కానీ రెట్టింపునకు పైగా సమయం

2లో



భారత స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించారు. దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన నలుగురు ప్రధానమంత్రుల్లో, ఎర్రకోట నుంచి అత్యధిక సమయం

## సీఎం విజయ్ తల్లిపై నైనార్ నాగేంద్రన్ వివాదాస్పద వ్యాఖ్యలు

తీవ్రంగా ఖండించిన టీవీకే, అన్నామలై



- ★ఉదయనిధిని ఉద్దేశించి మీ తండ్రి ఎక్కడ అని ప్రశ్నించిన విజయ్
- ★ఇంట్లో ఉన్న తల్లిని అడిగితే తెలుస్తుందన్న నాగేంద్రన్
- ★సీఎం తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను అంగీకరించలేమన్న అన్నామలై

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తల్లిని ఉద్దేశించి తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ - మిగతా 2 లో

## చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం.. రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్



- ●చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన
- ●అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశం
- ●డ్రోన్లతో నిఘా, రాత్రి పూట గస్తీ పెంచాలని కీలక సూచనలు
- ●పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందిస్తామని హామీ
- ●పరిస్థితిని బట్టి హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రవారిపాలెం మరియు సమీప గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం స్థానికంగా - మిగతా 2 లో

## విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'.. వైసీపీపై ఫైర్



- ❖విజయవాడలో మెగా డీఎస్సీ టీచర్ల ఆత్మగౌరవ ర్యాలీ
- ❖వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఉపాధ్యాయుల తీవ్ర ఆగ్రహం
- ❖ప్రచారం ఆపకుంటే ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామని హెచ్చరిక
- ❖ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది నూతన ఉపాధ్యాయులు
- ❖కష్టపడి ఉద్యోగాలు సాధిస్తే కించపరుస్తున్నారని ఆవేదన

తమ నియామకాలపై వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారంటూ మెగా - మిగతా 2 లో

# సీఎం క్యాంప్ ఆఫీసులో మహిళలకు 'హై టీ'

- ▶▶ఆత్మీయంగా పలకరించిన చంద్రబాబు.. ఫొటోలు ఇవిగో!
- ▶▶'స్త్రీ శక్తి' పథకం ఏడాది పూర్తైన వేళ ప్రత్యేక కార్యక్రమం
- ▶▶మహిళలతో కలిసి పల్లె వెలుగు బస్సులో ప్రయాణించిన సీఎం
- ▶▶క్యాంప్ కార్యాలయంలో మహిళా లబ్ధిదారులకు తేనీటి విందు
- ▶▶తమ భవిష్యత్ లక్ష్యాలను ముఖ్యమంత్రికి వివరించిన మహిళలు
- ▶▶అమరావతి పర్యటనకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎం ఆదేశం

2లో



ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం శనివారం ఓ అరుదైన, ఆత్మీయ కార్యక్రమానికి వేదికైంది. 'స్త్రీ శక్తి' పథకం ద్వారా లబ్ధి పొందుతున్న మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా తేనీటి విందు (హై టీ) ఇచ్చి, వారితో

# విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'.. వైసీపీపై ఫైర్

మొదటిపేజీ తరువాయి – డీఎస్సీ-2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు ఆదివారం విజయవాడలో భారీ 'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చేస్తున్న ఆరోపణలు వెంటనే ఆపకపోతే వైసీపీని ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సుమారు 7,000 మందికి పైగా నూతన ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన, అంబేద్కర్ స్మృతివనం వరకు కొనసాగింది. "వైసీపీ విష ప్రచారం నశించాలి", "టీచర్ల ఆత్మగౌరవాన్ని కించపరచొద్దు" అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కష్టపడి చదివి, మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు సాధించామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగం సాధించామన్న కనీస సంతోషాన్ని వైసీపీ నేతలు తమ విష ప్రచారంతో దూరం చేస్తున్నారని వాపోయారు. తమ ప్రతిభను శంకించి, నియామకాలపై బురద జల్లడం వల్ల తాము, తమ కుటుంబ సభ్యులు మానసికంగా కుంగిపోతున్నామని తెలిపారు. ఇప్పటికే కర్నూలు, తిరుపతితో పాటు పలు జిల్లాల్లో ఇలాంటి నిరసన ర్యాలీలు నిర్వహించామని, అయినా వైసీపీ నేతల తీరు మారకపోవడం దారుణమన్నారు. తమపై విమర్శలు చేస్తున్న వారికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ నిరసనను నిర్వహించారు. తమపై విష ప్రచారం తక్షణమే ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ చేతబడి చేయిస్తోంది.. సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు!

మొదటిపేజీ తరువాయి – కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండున్నరేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిందని, మరో 10 వేల పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని, యువత ప్రతిపక్షాల మాయలో పడకుండా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసిన సీఎం, ఇది కేవలం కాగితం ముక్క కాదని, పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవ కార్డు అని అన్నారు. గత ప్రభుత్వాలు దొడ్డు బియ్యం ఇచ్చి స్కామ్‌లు చేస్తే, తాము సన్నబియ్యం అందించి పేదల కడుపు నింపుతున్నామని తెలిపారు. బతుకమ్మ చీరల పేరుతో గతంలో నాసిరకం పంపిణీ చేస్తే, తాము పాలపిట్ట, చిలకపచ్చ రంగు చీరలతో మహిళల గౌరవం పెంచామని తెలిపారు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ బాగుపడకూడదని, రాష్ట్రంలో కరువు రావాలని కోరుకుంటూ బీఆర్ఎస్ నేతలు చేతబడులు, అఘోర పూజలు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. కర్ణాటక, తమిళనాడు ఆలయాల్లో అర్ధరాత్రి చేసిన పూజల రహస్యాన్ని బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తాము మంజూరు చేసిన 7 లక్షల ఇందిరమ్మ ఇళ్ల గ్రామాల్లోనే ఓట్లు అడుగుతామని, బీఆర్ఎస్ వారు కట్టిన డబ్బా ఇళ్ల వద్ద ఓట్లు అడగగలరా? అని సవాల్ విసిరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిని ప్రశంసలతో ముంచెత్తారు. రాహుల్ గాంధీ రాముడైతే, జగ్గారెడ్డి హనుమంతుడని కొనియాడారు. అనంతరం నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు.

# మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి

మొదటిపేజీ తరువాయి – డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. సూర్యాపేటలో నిన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ప్రాణం ఉన్నంతవరకు బీఆర్ఎస్‌తో కలవను

మొదటిపేజీ తరువాయి – భవిష్యత్తులో కలిసి పనిచేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఒక మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, "ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. కుటుంబ సభ్యులతో వ్యక్తిగత సంబంధాలు వేరని, రాజకీయాలు వేరని ఆమె తేల్చి చెప్పారు. అయితే, బీఆర్ఎస్ ను అధికారంలోకి రాకుండా చేయడం తమ సిద్ధాంతం కాదని కూడా అన్నారు. పార్టీ నుంచి తనను బహిష్కరించిన తీరుపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి షోకాజు నోటీసు ఇవ్వకుండానే తనను పార్టీ నుంచి పంపించేశారని, సస్పెన్షన్‌కు ఏడాది ముందు నుంచే తనను పక్కన పెట్టారని ఆరోపించారు. అయినప్పటికీ, నైతిక విలువలకు కట్టుబడి తానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. తన తండ్రి కేసీఆర్‌ను తాను ఎన్నడూ ఎదిరించలేదని ఆమె పేర్కొన్నారు. తన నూతన పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, రాబోయే ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వస్తామని కవిత ధీమా వ్యక్తం చేశారు. "మాది ఆర్ట్ మూవీ కాదు, కమర్షియల్ మూవీ. నేను గెలవకపోతే ఇంకెవరు గెలుస్తారో తెలియదు" అని వ్యాఖ్యానించారు. తన తండ్రి కేసీఆర్ తరహాలోనే తాను కూడా సరికొత్త చరిత్ర సృష్టిస్తానని ధీమాగా చెప్పారు. సామాజిక న్యాయం, లౌకికవాదమే తమ పార్టీ ప్రధాన ఎజెండా అని ఆమె వెల్లడించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని విమర్శించారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఢిల్లీ వేదికగా పోరాటం చేస్తామని పిలుపునిచ్చారు. ఇప్పటికే 100 రోజుల్లోనే 42 నియోజకవర్గాల్లో పార్టీ కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేశామని ఆమె వివరించారు.

# యూఎస్‌లో ఆగని గన్ కల్చర్.. పార్కు యూనివర్సిటీలో కాల్పులు



మొదటిపేజీ తరువాయి – వివరాల్లోకి వెళితే.. కెంటకీ రాష్ట్రంలోని లెక్సింగ్‌టన్ నగరంలో ఉన్న చార్లెస్ యంగ్ పార్కులో శనివారం సాయంత్రం దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో నాలుగేళ్ల చిన్నారి, 14 ఏళ్ల బాలుడు, మరో ఇద్దరు పెద్దలు ఉన్నారని లెక్సింగ్‌టన్ పోలీస్ చీఫ్ లారెన్స్ వెదర్స్ తెలిపారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించగా, ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు లెక్సింగ్‌టన్ డౌన్‌టౌన్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, నిందితుల కోసం గాలింపు చేపట్టారు. అయితే, ఈ ఘటనకు సంబంధించి నిందితుల వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు. ఇదే తరహాలో వర్జీనియా స్టేట్ యూనివర్సిటీలోనూ శనివారం తెల్లవారుజామున కాల్పుల ఘటన చోటుచేసుకుంది. యూనివర్సిటీలోని ఓ రెసిడెన్స్ హాల్ వెలుపల జరిగిన ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే క్యాంపస్‌ను తాత్కాలికంగా లాక్‌డౌన్ చేశారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, మిగిలిన వారికి ప్రాణాపాయం లేదని యూనివర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఘటన విద్యార్థుల్లో ఆందోళన నింపింది. కాగా, కొద్ది రోజుల క్రితం బుధవారం జార్జియాలోని ఓ హైస్కూల్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు విద్యార్థులు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పోలీసులు ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. వరుసగా విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో జరుగుతున్న ఈ కాల్పుల ఘటనలు అమెరికాలో తుపాకీ నియంత్రణ చట్టాలపై చర్చను మరోసారి తెరపైకి తెచ్చాయి.

# చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం.. రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

మొదటిపేజీ తరువాయి – తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఏనుగులు రాత్రివేళల్లో పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల సంచార మార్గాలను గుర్తించి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలు పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సమాచార వ్యవస్థలు, మైకులు, మొబైల్ సందేశాల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మన ప్రథమ కర్తవ్యం. ఏనుగుల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. అవసరమైతే, ప్రజల భద్రత కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన 'హనుమాన్' (హె.ఎ.ఎన్.యు.ఎం.ఎ.ఎన్ ... Healing and Nurturing Units for Monitoring, Aid and Nursing of Wildlife ) బృందాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలి" అని అధికారులకు స్పష్టం చేశారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు రూపొందించిన వెంటనే, అటవీశాఖ నిబంధనల ప్రకారం బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా భయాందోళనలకు గురికాకుండా, ధైర్యంగా ఉంటూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు.

# సీఎం క్యాంప్ ఆఫీసులో మహిళలకు 'హై టీ'





మొదటిపేజీ తరువాయి – ముఖాముఖిగా మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే 'స్త్రీ శక్తి' పథకం ప్రవేశపెట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం "స్త్రీ శక్తికి సంవత్సరం – రెట్టింపైన ఆత్మగౌరవం" పేరుతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి నేరుగా మహిళలతో కలిసి ఓ పల్లె వెలుగు బస్సులో క్యాంప్ కార్యాలయం వరకు ప్రయాణించారు. ప్రయాణంలో వారితో మాట్లాడుతూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళలతో ఏర్పాటు చేసిన తేనీటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ, వారి కుటుంబ వివరాలు, ఆర్థిక పరిస్థితులు, పథకం ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను ఆరా తీశారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని, ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం మహిళలకు సూచించారు. ఎన్నికల సమయంలో కొందరు పెట్టే ప్రలోభాలకు గురికావద్దని, అలాంటి వాటికి వ్యతిరేకంగా మహిళలే ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే పదేళ్లలో మీ లక్ష్యాలు ఏమిటని ఆయన ప్రశ్నించగా, మహిళల నుంచి స్ఫూర్తిదాయకమైన సమాధానాలు వచ్చాయి. కడపకు చెందిన ఓ ముస్లిం మహిళ తన డ్వాక్రా సంఘం ద్వారా రూ. కోటి పెట్టుబడితో వ్యాపారం చేయాలనేది తన లక్ష్యమని చెప్పగా, విశాఖకు చెందిన ఉద్యోగిని ఏఐ రంగంలో నైపుణ్యం సాధించి ఉన్నత స్థాయికి వెళ్లాలని ఉందని వివరించారు. 'స్త్రీ శక్తి' పథకం వల్ల తమకు నెలకు సుమారు రూ. 3 వేలు ఆదా అవుతున్నాయని కొందరు యువతులు తెలిపారు. ప్రభుత్వ పథకాలతో తాము ఆర్థికంగా బలపడి, మరికొందరికి ఉపాధి కూడా చూపగలుగుతున్నామని పలువురు మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. కాకినాడకు చెందిన ఓ మత్స్యకార మహిళ మాట్లాడుతూ, ఉచిత ప్రయాణం వల్ల చేపల విక్రయాలకు వివిధ ప్రాంతాలకు సులువుగా వెళ్లగలుగుతున్నానని, నెలకు సుమారు రూ.4,000 ఆదా అవుతోందని వివరించారు. ఆ డబ్బుతో తన ఆరోగ్య అవసరాలు తీరుతున్నాయని తెలిపారు. నంద్యాలకు చెందిన మరో మహిళ మాట్లాడుతూ, స్త్రీ శక్తితో పాటు ఇతర పథకాల ద్వారా తాను లబ్ధి పొందుతున్నానని, నెలకు రూ.1,500 వరకు ఆదా చేస్తున్నానని చెప్పారు. అనంతపురం జిల్లాకు చెందిన చేనేత మహిళ మాట్లాడుతూ, ముడిసరుకు కొనుగోలుకు, నేసిన చీరలను మార్కెట్లకు తరలించడానికి ఉచిత బస్సు ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతోందని అన్నారు. గతంలో తన భర్త ఒక్కరే వ్యాపారం చూసుకునేవారని, ఇప్పుడు తాను కూడా బయటకు వెళ్లి వ్యాపారాన్ని విస్తరించగలుగుతున్నానని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో తాము ఆర్థికంగా ఎదగడమే కాకుండా, మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకున్నామని పలువురు మహిళలు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా, అమరావతి నిర్మాణాలను చూడాలని ఉందని వారు కోరగా, సీఎం సానుకూలంగా స్పందించారు. వెంటనే వారి కోసం రాజధాని పర్యటనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



# నెహ్రూ, ఇందిరలను దాటేసిన మోదీ... ఎర్రకోట ప్రసంగాల్లో రికార్డ్



మొదటిపేజీ తరువాయి – ప్రసంగించిన నేతగా ఆయన నిలిచారు. ప్రసంగాల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, మొత్తం ప్రసంగ సమయం పరంగా మాజీ ప్రధానులందరి కంటే ఆయన ముందంజలో ఉండటం విశేషం. ప్రధాని మోదీ ఇప్పటివరకు 13 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ద్వారా మొత్తం 1,177 నిమిషాలు పాటు ప్రసంగించారు. ఇదే క్రమంలో, 16 ప్రసంగాల్లో ఇందిరా గాంధీ 504 నిమిషాలు, 10 ప్రసంగాల్లో మన్మోహన్ సింగ్ 417 నిమిషాలు, 17 ప్రసంగాల్లో జవహర్‌లాల్ నెహ్రూ 400 నిమిషాలు మాత్రమే ప్రసంగించారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ, ఇందిరా గాంధీల కంటే మోదీ తక్కువ సార్లు ప్రసంగించినప్పటికీ, వారిద్దరి మొత్తం ప్రసంగ సమయం కంటే రెట్టింపునకు పైగా మాట్లాడారు. మౌలిక సదుపాయాలు, డిజిటల్ కార్యక్రమాలు, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యం సాధన వంటి అంశాలపై ప్రభుత్వ విజయాలను, భవిష్యత్ ప్రణాళికలను ప్రజలకు వివరంగా తెలియజేయడానికే ప్రధాని నరేంద్ర మోదీ సుదీర్ఘ ప్రసంగాలకు ప్రాధాన్యతనిచ్చారు.

# సీఎం విజయ్ తల్లిపై నైనార్ నాగేంద్రన్ వివాదాస్పద వ్యాఖ్యలు



మొదటిపేజీ తరువాయి – నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపాయి. డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్‌ను ఉద్దేశించి "మీ నాన్న ఎక్కడ?" అంటూ అసెంబ్లీలో విజయ్ చేసిన విమర్శలపై స్పందిస్తూ నైనార్ నాగేంద్రన్ ఈ అనుచిత వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో 'తండ్రి' కోసం వెతకడం కాకుండా, ఇంట్లో ఉన్న తల్లిని అడిగితేనే తండ్రి ఎవరో తెలుస్తుందంటూ నాగేంద్రన్ వ్యాఖ్యానించారు. ఈ తరహా వ్యాఖ్యలపై టీవీకే వర్గాలు తీవ్రంగా మండిపడ్డాయి. నైనార్ నాగేంద్రన్ ఒక బాధ్యతాయుతమైన నాయకుడిగా కాకుండా వీధి చివర మాట్లాడే వ్యక్తిలా మాట్లాడారని విద్యాశాఖ మంత్రి రాజమోహన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన తన పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడుకుంటూ మాట్లాడాలని హితవు పలికారు. ఈ వివాదంపై బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కూడా తీవ్రంగా స్పందించారు. నైనార్ నాగేంద్రన్ రాజకీయ సంస్కృతి, ఎల్లలను దాటి మాట్లాడారని ఆయన ఖండించారు. తమిళనాడు రాజకీయాన్ని ఈ స్థాయిలో దిగజార్చడం అత్యంత విచారకరమని, విజయ్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఎంతమాత్రం అంగీకరించలేమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. విధానపరమైన వ్యత్యాసాలు, ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేయడం సహజమే అయినప్పటికీ... కుటుంబ సభ్యులను, ముఖ్యంగా తల్లిని లాగి మాట్లాడడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.

# నేను గర్వపడే 'దిమాగీ నక్సల్'ను: మోదీకి చిదంబరం కౌంటర్



మొదటిపేజీ తరువాయి – నక్సలిజం) వ్యాఖ్యలపై రాజకీయ దుమారం చెలరేగింది. ప్రధాని వ్యాఖ్యలకు కౌంటర్‌గా, తాను 'గర్వపడే దిమాగీ నక్సల్' అని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ప్రకటించారు. ప్రధాని చేసిన వ్యాఖ్యల అనంతరం ఆదివారం ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "నేను గర్వపడే దిమాగీ నక్సల్‌ను!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. శనివారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ, దేశంలో సాయుధ నక్సలిజాన్ని బలహీనపరచడంలో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. అయితే, 'దిమాగీ నక్సలిజం' రూపంలో ఒక కొత్త సవాల్ పొంచి ఉందని హెచ్చరించారు. "అడవుల్లో సాయుధ నక్సల్స్‌ను మనం వదిలించుకున్నాం. కానీ హింస, అశాంతిని సృష్టించడానికి 'దిమాగీ నక్సల్స్' అవకాశాల కోసం చూస్తున్నారు. వారు సమాజాన్ని తప్పుదోవ పట్టించాలనుకుంటున్నారు. ఈ 'దిమాగీ నక్సల్స్'ను గుర్తించి, వారిని ఏకాకులను చేయాలి. యువతను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలి" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. రాజకీయ ప్రత్యర్థులపై ప్రధాని మోదీ రెచ్చగొట్టే పదజాలాన్ని వాడుతున్నారని, ఇది ఆయనలోని రాజకీయ నిస్పృహను ప్రతిబింబిస్తోందని ఆరోపించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ప్రధాని వ్యాఖ్యలను తప్పుబట్టారు. గతంలో ఆయన ఉపయోగించిన 'అర్బన్ నక్సల్స్' పదాన్ని గుర్తుచేశారు. "మొదట ఆయన తన ప్రత్యర్థులను 'అర్బన్ నక్సల్స్' అన్నారు. ఇప్పుడు 'దిమాగీ నక్సల్స్' అంటున్నారు. ఇది ఆయన నిరాశకు స్పష్టమైన సంకేతం" అని జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అంతేకాకుండా, 'అర్బన్ నక్సల్స్' లేదా 'దిమాగీ నక్సల్స్' అని ముద్ర వేసిన వారు డిమాండ్ చేసిన అనేక అంశాలను చివరికి ప్రధాని మోదీయే అమలు చేస్తుంటారని ఆయన ఆరోపించారు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి.. రంగంలోకి రెవెన్యూ అధికారులు



సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఉద్యోగ కల్పనలో దూసుకుపోతున్న ఎలక్ట్రానిక్స్ వచ్చే మూడేండ్లలో కోటి ఉద్యోగాలు



ఉద్యోగ కల్పనలో ఎలక్ట్రానిక్స్ రంగం దూసుకుపోతున్నది. వచ్చే మూడేండ్లలో ఈ రంగంలో 1.2 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని టీమ్‌లీజ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో 30 లక్షల మంది ప్రత్యక్షంగానూ, మరో 90 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొంది. ప్రత్యక్షంగా ఉపాధి లభించనున్నవారిలో 10 లక్షల మంది ఇంజినీర్లు, 20 లక్షల మంది ఐటీఐ ప్రొఫెషనల్స్, 2 లక్షల మంది కృత్రిమ మేధస్సు, మెషిన్‌లెర్నింగ్, డాటా సైన్సెస్, నాన్-టెక్నికల్ విభాగానికి చెందిన 90 లక్షల మందికి ఉపాధి లభించనున్నది.

**ఇంకా చదవల్సిన వార్తలు**

**రిలయన్స్ చేతికి కార్కినోస్**

దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థయైన ఆర్ఎస్‌బీవీఎల్ ..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవలను మరింత విస్తరించడంలో భాగంగా కార్కినోస్‌ను కొనుగోలు చేసింది. ఒప్పందం విలువ రూ.375 కోట్లు. జూలై 24, 2020లో ప్రారంభమైన కార్కినోస్..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవల్లో భాగంగా రోగ నిర్ధారణ, నిర్వహణ, అలాగే క్యాన్సర్‌ను ముందుగా గుర్తించే టెక్నాలజీ సేవలను అందిస్తున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను సంస్థ టర్నోవర్ రూ.22 కోట్లుగా ఉన్నది. ప్రస్తుతం సంస్థ దేశవ్యాప్తంగా 60 ఆసుపత్రులతో ఒప్పందం కుదుర్చుకొని వైద్య సేవలు అందిస్తున్నది.

## ఫండ్లలో మహిళా ఇన్వెస్టర్ల జోరు ఏడాదిలో రెండున్నర రెట్లు పెరిగిన సంఖ్య




దేశీయ మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో మహిళా పెట్టుబడిదారులు భారీగా పెరుగుతున్నారు. ప్రస్తుత సంవత్సరంలో చిన్న, మధ్యస్థాయి నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారని, గడిచిన ఏడాదికాలంలో వీరి సంఖ్య రెండున్నర రెట్లు పెరిగినట్లు ఆన్‌లైన్ బ్రోకరేజ్ సంస్థ గ్రోవ్ తెలిపింది. మహిళల్లో ఆర్థిక స్వావలంభన పెరుగుతున్నదని, ముఖ్యంగా పట్టణ, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలతోపాటు చిన్న స్థాయి నగరాల్లో సైతం 140 శాతం పెరిగిందని, దీంతో వీరు ఈక్విటీ మార్కెట్లతోపాటు ఎంఎఫ్ మార్కెట్లలో విరివిగా పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించింది. మిగతా రంగాలకు దూరంగా ఉంటున్న మహిళలు..ఈక్విటీ, ఫండ్లలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు, ఈ ఏడాది కోటి మందికి పైకి చేరుకున్నారని గ్రోవ్ కో-ఫౌండర్, సీఈవో లలిత్ కేశ్రా తెలిపారు. గడిచిన ఏడాదికాలంలో మెట్రో, టైర్-1,2,3 నగరాల్లో ఫండ్లలో పెట్టుబడులు పెట్టే మహిళలు 100 శాతం చొప్పున పెరిగారు. నగరాల వారీగా చూస్తే ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పూణె, లక్నో, అహ్మదాబాద్, జైపూర్ వంటి మెట్రో నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేశారు. అలాగే పురుషుల కంటే సిప్‌లలో మహిళలు అత్యధికంగా పెట్టుబడులు పెట్టడం విశేషం. ఈ ఏడాది మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ ఏయూఎం రూ.17 లక్షల కోట్ల మేర పెరిగిందని ఆంఫీ తెలిపింది. డిసెంబర్ 2023లో రూ.50.79 లక్షల కోట్లుగా ఉన్న ఫండ్ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.68 లక్షల కోట్లకు చేరుకున్నది. అలాగే గత నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లో కొత్తగా 42.76 లక్షల మంది చేరారు. అలాగే గడిచిన నాలుగేండ్లుగా ప్రతియేటా 3 కోట్ల డీమ్యాట్ ఖాతాలు ప్రారంభిస్తున్నారు.

## మూడేండ్లలో 1.2 కోట్ల ఎలక్ట్రానిక్స్ కొలువులు తేల్చేసిన టీం లీజ్



వచ్చే మూడేండ్లలో (2027 నాటికి) దేశంలో ఎలక్ట్రానిక్ రంగంలో 1.2 కోట్ల ఉద్యోగాలు లభిస్తాయని ఓ అధ్యయనం తెలిపింది. అందులో 30 లక్షలు ప్రత్యక్షంగా, 90 లక్షల ఉద్యోగాలు పరోక్షంగా లభిస్తాయని టీం లీజ్ డిగ్రీ అప్రంటిస్ షిప్ నివేదిక పేర్కొంది. ప్రత్యక్ష ఉద్యోగ నియామకాల్లో సుమారు పది లక్షల మంది ఇంజినీర్లు, 20 లక్షల మంది ఐటీఐ సర్టిఫైడ్ నిపుణులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ రంగాల్లో నైపుణ్యం కలిగిన వారు రెండు లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. నాన్ టెక్నికల్ ఉద్యోగాల్లో 90 లక్షల మందికి పరోక్ష ఉపాధి లభిస్తుందని, తద్వారా దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పాటునిస్తుందని టీం లీజ్ డిగ్రీ అప్రంటిస్ షిప్ నివేదిక పేర్కొంది. 2030 నాటికి 500 బిలియన్ డాలర్ల విలువ గల ఉత్పత్తులను తయారు చేయాలని ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని చేదించాలని వచ్చే ఐదేండ్లలో ఎలక్ట్రానిక్స్ రంగం ఐదు రెట్లు తప్పనిసరిగా వృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. తద్వారా 400 బిలియన్ డాలర్ల విలువ గల ఉత్పత్తుల తయారీకి గల గ్యాప్ భర్తీ అవుతుందని అంచనా వేసింది. ప్రస్తుతం 101 బిలియన్ డాలర్ల విలువ గల మొబైల్ ఫోన్లు 43 శాతం, 12 శాతం చొప్పున కన్జూమర్, ఇండస్ట్రీయల్ ఎలక్ట్రానిక్స్, 11 శాతం ఎలక్ట్రానిక్ కాంపొనెంట్స్ తయారు చేస్తోంది ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ. వీటితోపాటు 8 శాతం ఆటో ఎలక్ట్రానిక్స్, మూడు శాతం ఎల్ఈడీ లైటింగ్, ఒక శాతం వేరబుల్స్ అండ్ ఇయరబుల్స్, ఒకశాతం పీసీబీఏస్ తయారు చేయాల్సి ఉంటుంది. త్వరితగతిన భారత్ ఎలక్ట్రానిక్ రంగం గ్లోబల్ ఎలక్ట్రానిక్ హబ్ గా అవతరిస్తోంది. గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ లో భారత్ వాటా 3.3 శాతం కాగా, విదేశాలకు 2022-23లో భారత్ వాణిజ్య ఎగుమతుల్లో 5.3 శాతం ఎలక్ట్రానిక్ ఉత్పత్తులేనని టీం లీజ్ డిగ్రీ అప్రెంటిస్ షిప్ చీఫ్ స్ట్రాటర్జీ ఆఫీసర్ సుమిత్ కుమార్ తెలిపారు.

## జనవరి 6న భారత్ మార్కెట్లో రెడ్‌మీ 14సీ 5జీ ఆవిష్కరణ ఇవీ స్పెషిఫికేషన్స్



ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ రెడ్‌మీ తన రెడ్‌మీ 14సీ 5జీ ఫోన్‌ను భారత్ తోపాటు సెలెక్టెడ్ గ్లోబల్ మార్కెట్లలో ఆవిష్కరించేందుకు ముహూర్తం ఖరారు చేసింది. 2025 జనవరి ఆరో తేదీన భారత్ మార్కెట్లో ఆవిష్కరిస్తారు. రెడ్‌మీ 14 ఆర్ 5జీ ఫోన్‌ను పోలి ఉండే రెడ్‌మీ 14సీ 5జీ ఫోన్‌లో లార్జ్, సెంటర్డ్ సర్క్యులర్ రేర్ కెమెరా మాడ్యూల్ ఉంటుంది. ఏఐ బ్యాక్డ్ 50-మెగా పిక్సెల్ మెయిన్ కెమెరా సెన్సర్ తోపాటు డ్యుయల్ రేర్ కెమెరా సెటప్, ఎల్ఈడీ ఫ్లాష్ యూనిట్ ఉంటాయి. రెడ్‌మీ కంపెనీ వెబ్‌సైట్‌తోపాటు అమెజాన్‌లో ఈ ఫోన్ లభ్యం అవుతుంది. రెడ్‌మీ 14సీ 5జీ ఫోన్ బ్లాక్, బ్లూ, పర్పుల్ కలర్ ఆప్షన్లలో లభిస్తుందని భావిస్తున్నారు. సెక్యూరిటీ కోసం ఫింగర్ ప్రింట్ సెన్సర్ కూడా ఉంటుంది. 6.88 అంగుళాల ఎల్‌సీడీ ప్యానెల్ విత్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్ ఉంటుంది. క్వాల్ కామ్ స్నాప్ డ్రాగన్ 4 జెన్ 2 ప్రాసెసర్ తో వస్తుంది. 18 వాట్ల చార్జింగ్ మద్దతుతో 5160 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీ కలిగి ఉంటుంది. ఈ ఫోన్ ఆండ్రాయిడ్ 14 బేస్డ్ హైపర్ ఓఎస్ పై పని చేస్తుంది. 50-మెగా పిక్సెల్ మెయిన్ సెన్సర్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 5-మెగా పిక్సెల్ కెమెరా ఉంటాయి. ఈ ఫోన్ రూ.12 వేల లోపు ధరకే లభిస్తుందని భావిస్తున్నారు. ఇంకా రెడ్‌మీ తన రెడ్‌మీ 14సీ 5జీ ఫోన్ ధర వివరాలు వెల్లడించలేదు.

# టెలికం సంస్థలకు ఇక్కట్లే టారీఫ్‌ల పెంపుతో కొత్త ఏడాదిలో సవాళ్లే !

### శాట్కామ్ సర్వీసెస్‌తో ధరల యుద్ధానికి అవకాశం



దేశీయ ప్రైవేట్ టెలికం సంస్థలకు కొత్త ఏడాదిలో ప్రధానంగా రెండు సవాళ్లు ఎదురుకావచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆయా టెలికం కంపెనీలు టారీఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. అయితే ఇది రివర్స్ ఫైర్ అయిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాన టెలికం సంస్థల నుంచి కస్టమర్లు ఇతర సంస్థల్లోకి మారిపోతున్నారు. దీంతో వచ్చే ఏడాదీ ఈ జంపింగ్‌లుంటాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజానికి ఇప్పటికే రిచార్జ్ ప్లాన్ల ధరలు ఠారెత్తిస్తున్నాయి. అయినప్పటికీ ఖర్చులు పెరిగాయన్న కారణాలతో టెలికం ఆపరేటర్లు ధరల భారాన్ని కస్టమర్లపై మోపుతూనే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మధ్యలో ధరలు మరింత పెరగడంతో సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెద్ద ఎత్తునే పడిపోయింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల్లో చార్జీలు 10 నుంచి 26 శాతం మేర పెరిగాయి. దీంతో ఆయా సంస్థలు 2.6 కోట్ల కస్టమర్లను కోల్పోయాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. మరోవైపు దాదాపు 68 లక్షల కస్టమర్లు ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ కనెక్షన్‌ను తీసుకున్నట్టు తేలింది. ఇప్పటికీ బీఎస్ఎన్ఎల్ 3జీ సర్వీసులనే ఇస్తుండగా, 4జీ సేవల విస్తరణ పనుల్లో ఉండటం గమనార్హం. అయినప్పటికీ కొత్త కస్టమర్లు వస్తున్నారంటే ధరల భారం ఏ స్థాయిలో ప్రైవేట్ కంపెనీలకు ప్రతికూలంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

**శాట్కామ్‌ల ఎంట్రీతో..**

వచ్చే ఏడాది శాటిలైట్ ఆధారిత సేవల సంస్థలతోనూ టెలికం కంపెనీలకు మార్కెట్‌లో భారీగానే పోటీ ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ప్రధానంగా ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ రాకతో ప్రస్తుతం టెలికం సంస్థలకు పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న డాటా వ్యాపారానికి ఎదురుదెబ్బేనన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శాట్కామ్ సర్వీసులతో ధరల యుద్ధానికి వీలుందని, డాటా ధరలు ఇంకా పడిపోవచ్చని చెప్తున్నారు. ఇదే గనుక జరిగితే ప్రైవేట్ రంగ టెలికం సంస్థలకు నష్టాలే. 5జీ సేవలను దేశవ్యాప్తంగా విస్తరిస్తూపోతున్న టెల్కోలు.. అందుకోసం రూ.70వేల కోట్లదాకా పెట్టుబడులు పెట్టాయి.

# అదిరిపోయే లుక్‌లో మారుతి కొత్త కార్లు 2025లో వచ్చేస్తున్నాయి




### 2025లో నాలుగు కార్లను విడుదల చేయనున్న సంస్థ

కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నది. ఇప్పటికే కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్న సంస్థ..కొత్త ఏడాదిలో నయా మాడళ్లను విడుదల చేయబోతున్నది. ఢిల్లీ వేదికగా జరగనున్న వాహన పండుగలో ఈ కొత్త మాడళ్లను ప్రదర్శిస్తున్నది. వీటిలో తొలి ఎలక్ట్రిక్ వాహనంతోపాటు మూడు ఎస్‌యూవీ మాడళు ఉన్నాయి.

**వీటి వివరాలు..**

మారుతి ఈ-విటారా:దేశీయంగా ఈవీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మారుతి కూడా ఈ మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. వచ్చే నెలలో 17 నుంచి 22 వరకు ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తన తొలి ఈ-విటారాను ప్రదర్శించబోతున్నట్లు తెలుస్తున్నది. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్లా బ్యాటరీ సామర్థ్యంతో రూపొందించిన ఈ కారు ధర రూ.22 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. సింగిల్ చార్జింగ్‌తో 550 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.25 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోసిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, 360-డిగ్రీల కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి.

**నయా గ్రాండ్ విటారా**

కాంప్యాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి నయా గ్రాండ్ విటారాను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. వచ్చే ఏడాది జూన్‌లో ప్రవేశపెట్టనున్న ఈ కారును సరికొత్తగా తీర్చిదిద్దినట్లు,ముఖ్యంగా ఇంటీరియర్ డిజైనింగ్, డ్యాష్‌బోర్డ్, ఐదు-ఏడుగురు కూర్చోవడానికి విధంగా డిజైన్ చేసింది.

**కొత్త బాలెనో**

ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనోను మరింత ఆధునీకరించి విడుదల చేయడానికి సిద్ధమైంది మారుతి. మార్చి నెలలో అందుబాటులోకి రానున్న ఈ కారులో అతిపెద్ద టచ్‌స్క్రీన్, ఫుల్ డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే,సింగిల్-ప్యాన్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, టైర్-ప్రెషర్ మానటరింగ్ సిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లతో తీర్చిదిద్దింది.

**అప్‌గ్రేడ్ బ్రెజ్జా**

మూడేండ్ల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చిన బ్రెజ్జాను మళ్లీ ఆధునీకరించి మార్కెట్లో విడుదల చేయబోతున్నది సంస్థ. స్కోడా కైలాక్, కియా సైరోస్‌ల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి ఈ నయా మాడల్‌ను తెస్తున్నది.

# ఇన్వెస్టర్లకు లాభాల పంట బంగారం గోల్డ్ అండ్ సిల్వర్ ఈటీఎఫ్స్‌పై రిటర్న్స్ ఎంతో తెలుసా



బంగారం అన్నా, బంగారం ఆభరణాలు అన్నా, వెండి అన్నా భారతీయులకు ఎంతో ఇష్టం. పండుగలు, కుటుంబ వేడుకలు, ఇతర పర్వదినాల సందర్భంగా భారతీయ మహిళలు బంగారం కొనుగోలుకు మొగ్గుచూపుతుంటారు. వీలు కాకుంటే ఉన్న బంగారం ఆభరణాలే ధరించడానికి ఉత్సుకత ప్రదర్శిస్తుంటారు. రోజురోజుకు ద్రవ్యోల్బణం పెరిగిపోతున్న నేపథ్యంలో పెట్టుబడులకు ప్రత్యామ్నాయ మార్గంగా కూడా బంగారం నిలుస్తోంది. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.63,870 పలికింది. శుక్రవారం దేశ రాజధాని ఢిల్లలో తులం బంగారం ధర రూ.79,200లకు చేరుకుంది. అంటే దాదాపు 24 శాతం బంగారం ధర పెరిగింది. ఇక కిలో వెండి ధర జనవరి ఒకటో తేదీన రూ.80 వేల వద్ద తచ్చాడితే శుక్రవారం రూ. 91,700 పలుకుతోంది. అంటే వెండి కొనుగోళ్లపై 16 శాతం రిటర్న్స్ లభిస్తున్నాయన్న మాట

**గోల్డ్ అండ్ సిల్వర్ ఈటీఎఫ్స్‌పై 20 శాతం రిటర్న్స్**

బంగారం దిగుమతులను నిరుత్సాహ పర్చడానికి కేంద్రం ఈటీఎఫ్ లు తీసుకొచ్చింది. ఫిజికల్ బంగారంతోపాటు డిజిటల్ బంగారంగా భావించే గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులపై ఇన్వెస్టర్లకు ఈ ఏడాది దాదాపు 20 శాతం రిటర్న్స్ అందించాయి. ఇక వెండి ఈటీఎఫ్స్ మీద 19.66 శాతం రిటర్న్స్ లభించాయి. వివిధ బ్యాంకులు, సంస్థలు నిర్వహించిన ఈ ఈటీఎఫ్ ఫండ్స్ 31 వరకూ ఉన్నాయి. గోల్డ్ ఈటీఎఫ్స్‌ల్లో అత్యధికంగా హెచ్డీఎఫ్సీ గోల్డ్ ఈటీఎఫ్ నుంచి 20.30 శాతం రిటర్న్స్ వస్తే, ఇన్వెస్కో ఇండియా గోల్డ్ ఈటీఎఫ్ 20.29 శాతం లాభాలు గడించి పెట్టింది. ఎస్బీఐ గోల్డ్ ఈటీఎఫ్ 19.94 శాతం, యాక్సిస్ గోల్డ్ ఈటీఎఫ్ కనిష్టంగా 19.66 శాతం రిటర్న్స్ మాత్రమే ఇన్వెస్టర్లకు అందించింది. ఇక 17 సిల్వర్ ఈటీఎఫ్ ల్లోనూ హెచ్డీఎఫ్సీ సిల్వర్ ఈటీఎఫ్ మొదటి వరుసలో నిలిచింది. హెచ్డీఎఫ్సీ సిల్వర్ ఈటీఎఫ్ లో పెట్టుబడులపై అత్యధికంగా 22.02 శాతం, నిప్పన్ ఇండియా సిల్వర్ ఈటీఎఫ్ 20.33 శాతం, యూటీఐ సిల్వర్ ఈటీఎఫ్ 18.46 శాతం రిటర్న్స్ అందించాయి. జాతీయంగా, అంతర్జాతీయంగా బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరల పెరుగుదలకు అనుగుణంగా ఈటీఎఫ్ విలువ కూడా పెరుగుతుంది.2023లో గోల్డ్ ఈటీఎఫ్ లు సరాసరి 13 శాతం రిటర్న్స్ అందిస్తే, సిల్వర్ ఈటీఎఫ్ ల నుంచి ఇన్వెస్టర్లు 4.17 శాతం లాభాలు సంపాదించారు.



## బ్యాంకింగ్, ఆటో షేర్ల దన్ను

బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లైన బీఎసఈ సెన్సెక్స్, ఎన్‌ఎసఈ నిఫ్టీ శుక్రవారం బ్యాంకింగ్, ఆటోమొబైల్ షేర్ల దన్నుతో లాభాల్లో ముగిసాయి. సెన్సెక్స్ 226.59 పాయింట్ల లాభంతో 78,699.07 పాయింట్ల వద్ద ముగియగా నిఫ్టీ 63.20 పాయింట్లు లాభపడి 23,813.40 పాయింట్ల వద్ద క్లోజైంది. వారం మొత్తానికి చూస్తే సెన్సెక్స్ 657.48 పాయింట్లు, నిఫ్టీ 225.90 పాయింట్ల మేరకు లాభపడింది.

శుక్రవారం 18- 09 - 2026

# జీజీహెచ్ పెండింగ్ పనులు పూర్తి చేయాలి.....!!

## పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ,బుట్టా రేణుక

75 శాతం పనులు పూర్తి..

మిగిలిన 25 శాతం పనులకు నిధులు కేటాయించాలి

ఒకే బెడ్‌పై ముగ్గురు రోగులకు చికిత్స దారుణం

ఆపరేషన్ థియేటర్ల కొరతతో రోగులకు ఇబ్బందులు

పనులు పూర్తి చేయకపోతే ప్రజల పక్షాన పోరాటం








**కర్నూలు, సెప్టెంబర్ 17,ప్రభ మనం:** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిలిచిపోయిన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ బుట్టా రేణుక డిమాండ్ చేశారు. గురువారం జీజీహెచ్‌ను సందర్శించిన ఆమె వివిధ వార్డులు, నిర్మాణ పనులను పరిశీలించారు. నాడు--నేడు కింద చేపట్టిన పనుల్లో దాదాపు 75 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 25 శాతం పనులను అవసరమైన నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గత వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగించకుండా నిలిపివేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు. పలు వార్డుల్లో ఒకే బెడ్‌పై ముగ్గురు రోగులకు చికిత్స అందిస్తున్న పరిస్థితి దారుణమన్నారు. నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో ఆపరేషన్ థియేటర్ల కొరత ఏర్పడి రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కర్నూలుతో పాటు రాయలసీమ, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల ప్రజలకు సేవలందించే కీలక ఆసుపత్రి అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. పెండింగ్ పనులకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని బుట్టా రేణుక డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

# జర్నలిస్టుపై దురుసుగా ప్రవర్తించిన సీఐ జయన్నను సస్పెండ్ చేయాలి

పెద్దకడబూరులో ఏపీయుడబ్ల్యూజే ధర్నా







**పెద్దకడబూరు, సెప్టెంబర్ 17,ప్రభ మనం:** పత్తికొండ విశాలాంధ్ర విలేకరి నాగరాజుపై అర్బన్ సీఐ జయన్న దురుసుగా ప్రవర్తించారంటూ ఆరోపిస్తూ,ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీయూడబ్ల్యూజే మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర సమితి సభ్యులు జేబీ భీమన్న,తాలూకా సహాయ కార్యదర్శి బొగ్గుల ఈరన్న,తాలూకా ఉపాధ్యక్షులు జె. పుల్లయ్య,నాయకులు ఎంసీ నారాయణ, ఏలియస్,మంచోది రాజు,సీపీఐ మండల కార్యదర్శి వీరేష్,రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మబ్బు అంజినేయ,ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్ పటేల్,నాయకులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతి,అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులపై దాడులు, దౌర్జన్యాలు,కేసులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పత్రికా స్వేచ్ఛను పరిరక్షించేందుకు ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.పందికోన గ్రామంలో ఇటీవల రెండు వర్గాల మధ్య ఘర్షణ జరగడంతో ఇరువర్గాలు పత్తికొండ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగాయని తెలిపారు.ఘటనపై వార్తా సేకరణ కోసం విశాలాంధ్ర రిపోర్టర్ నాగరాజు పత్తికొండ అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా,లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో సీఐ జయన్న అడ్డుకుని దుర్భాషలాడడంతో పాటు మెడ పట్టుకుని నెట్టివేశారని వారు ఆరోపించారు.విధి నిర్వహణలో భాగంగా వార్తా సేకరణకు వెళ్లిన జర్నలిస్టుతో పోలీసు అధికారి ఈ విధంగా ప్రవర్తించడం సరికాదని పేర్కొన్నారు.ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి సీఐ జయన్నపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే నంద్యాలలో ఐ న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ బసవరాజు, రిపోర్టర్లు సురేష్,నాగచంద్రుడిపై నమోదైన కేసులను ఎత్తివేయాలని కోరారు.వార్తల్లో అభ్యంతరాలుంటే ఖండన ఇవ్వడం లేదా చట్టపరమైన మార్గాలను ఆశ్రయించడం వంటి అవకాశాలు ఉన్నాయని,జర్నలిస్టులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే అంశమని పేర్కొన్నారు.జర్నలిస్టులపై వేధింపులు, దాడులకు అడ్డుకట్ట వేసి,మీడియా స్వేచ్ఛను కాపాడాలని తహసీల్దార్ వలిబాషా వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు,ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పై దౌర్జన్యాలు, అక్రమ కేసులు అరికట్టాలి

- పత్తికొండ అర్బన్ సీఐ జయన్న పై చర్యలు తీసుకోవాలి
- ఐ న్యూస్ రిపోర్టర్స్ పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా, డీఅర్ఓ కు వినతి





**కర్నూలు, సెప్టెంబర్ 17,ప్రభ మనం:** జర్నలిస్టుల పై రోజు రోజు కు దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి అరికట్టాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఈ. ఎన్.రాజు, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కే నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర సమితి సభ్యులు భాష్యం మధు సుధన్, జిల్లా కోశాధికారి అంజి, జిల్లా సహాయ కార్యదర్శి శివ రాజ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి కోరారు. పత్తికొండ విశాలాంధ్ర రిపోర్టర్ నాగరాజు ను దుర్భాషలాడిన జయన్న పై చర్యలు తీసుకోవాలని, ఐ న్యూస్ రిపోర్టర్స్ పై అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరుతూ గురువారం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ ధర్నా కు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ మునెప్ప, లెనిన్ బాబు, నగర కార్యదర్శి రామకృష్ణ రెడ్డి, డీహెచ్పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, ఏ ఐ వై ఎఫ్ నగర కార్యదర్శి బీసన్న, ఏ ఐ ఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి బీ రంగస్వామి, ఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రవి కుమార్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత వారం రోజుల క్రితం పత్తికొండ మండలం పందికోన గ్రామంలో రెండు వర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడమే కాకుండా పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారన్నారు. పోలీసులు ఇరు వర్గాలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారన్నారు. ఈ విషయం తెలుసుకున్న విశాలాంధ్ర రిపోర్టర్ నాగరాజు వార్తా కవరేజ్ కోసం పత్తికొండ అర్బన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారన్నారు. ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు స్టేషన్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో అక్కడ ఉన్న అర్బన్ సీఐ జయన్న ఆయనను బయటకు వెళ్లాలని సూచించారని, తాను జర్నలిస్టునని నాగరాజు చెప్పినప్పటికీ వినకుండా నానా దుర్భాషలాడడమే కాకుండా మెడపట్టి నెట్టివేయడం బాధాకరం అన్నారు. వార్తా సేకరణ కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన జర్నలిస్టుతో ఒక పోలీస్ అధికారి ఈ విధంగా ప్రవర్తించడం ఆందోళన కలిగించే విషయమన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి సీఐ జయన్న పై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇటీవల మంత్రి ఫరూక్ కుమారుల మీద వార్తలు ఇచ్చిన ఐ న్యూస్ స్టాఫ్ రిపోర్టర్ బసవరాజు, రిపోర్టర్స్ సురేష్, నాగ చంద్రుడు పై కేసులు బనాయించి రిమాండ్ కు పంపడం జరిగింది. వాస్తవానికి వార్తల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఖండన ఇచ్చుకోవచ్చు. లేదా పరువుకు నష్టం కలిగింది అని భావిస్తే పరువు నష్టం దావా కూడా వేయవచ్చు. కానీ అవేవీ పాటించకుండా అధికారం ఉపయోగించి రిపోర్టర్స్ పై కేసులు పెట్టి రిమాండ్ కు పంపడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, పత్రికా స్వేచ్ఛ కు విఘాతం కలిగే అంశం. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఐ న్యూస్ రిపోర్టర్స్ పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. అనంతరం డీఆర్ఓ వెంకట నారాయణమ్మ కు వినతి పత్రం అందజేచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు, సీనియర్ జర్నలిస్టు లు సత్యనారాయణ గుప్తా, ఆర్టీవీ హుస్సేన్, ఖలీల్, నగర అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ నాగేశ్వర రావు, మల్లికార్జున, శ్రీనాథ్ రెడ్డి, ఇస్మాయిల్, సుధాకర్, హుస్సేన్, రఘు, శేఖర్, గంగాధర్, రమేష్ రెడ్డి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రధాని మోదీలి 76వ జన్మదిన వేడుకలు

బీజేపీ మండల అధ్యక్షుడు టైలర్ లక్ష్మన్న ఆధ్వర్యంలో

**తుగ్గలి, సెప్టెంబర్ 17 (ప్రభ మనం న్యూస్):** మండల కేంద్రమైన తుగ్గలి లో ప్రధాని నరేంద్ర మోదీ 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని తుగ్గలి మండలంలో బీజేపీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రమైన తుగ్గలిలోని వాల్మీకి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగించారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు సంఘీభావం తెలిపారు. మోదీ ఆయురారోగ్యాలతో మరెన్నో జన్మదినాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపి మండల అధ్యక్షుడు ఆర్ తిరుపాల్ నాయుడు, వల్లే వెంకటేష్, రాంపల్లి రంగయ్య, ఎద్దులదొడ్డి లక్ష్మన్న, బోయ ఈశ్వరప్ప, బెస్త ఆకుల శ్రీనివాసులు, బోయ ఆంజనేయులు, కొట్టం సుంకప్ప తదితర నాయకులు పాల్గొన్నారు.

# కోతికొండలో సేవా కార్యక్రమాలతో మోదీ జన్మదిన వేడుకలు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన





**తుగ్గలి, సెప్టెంబర్ 17 ( ప్రభ మనం న్యూస్ ):** తుగ్గలి మండలం కోతికొండ గ్రామంలో ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి గ్రామస్తులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో ముడిపెట్టి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తుగ్గలి ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ అమర్నాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో గ్రామస్తులు, విద్యార్థులకు వైద్య పరీక్షలు చేపట్టి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. డాక్టర్ అమర్నాథ్ మాట్లాడుతూ పేద, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీజేపీ నాయకులు టైలర్ లక్ష్మన్న, రాంపల్లి రంగయ్య, ఎద్దులదొడ్డి లక్ష్మణస్వామి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డీలర్ అయ్యన్న, ఎంపీహెచ్ఈఓ వెంకటరామయ్య, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు, వైద్య సిబ్బంది రాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# శ్రీ మఠంలో ప్రముఖ సినీ నటుడు రామ్ చరణ్ సతీమణి కొణిదెల ఉపాసన



**మంత్రాలయం , న్యూస్ ;-** ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం అపోలో వైద్యాశాల వైస్ ప్రెసిడెంట్ , తెలుగు చలనచిత్ర ప్రముఖ నటుడు రామ్ చరణ్ సతీమణి కొణిదెల ఉపాసన స్నేహితులతో కలిసి గురువారం మంత్రాలయంకు వచ్చారు. ఆమె కు మఠం సహాయ మేనేజర్ ఐపి నరసింహ స్వామి, సూపరింటెండెంట్ పురానిక్ రాఘవేంద్ర లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆమె ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని , పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వారికి మఠం పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు పట్టుచీర ఫల మంత్రాక్షితలు రాఘవేంద్రస్వామి మెమోంటో ఇచ్చి ఆశీర్వదించారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి మీ ద్వారా సహాయసకారాలు అందించాలని ఆమె ను పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థులు కోరారు. వారి వెంట మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు , ఎస్ఐ లు మల్లికార్జున , విజయకుమార్ , హెడ్ కానిస్టేబుల్ మురళి రెడ్డి , శ్రీ రాములు , కానిస్టేబుల్ సోమశేఖర్ , రంగస్వామి , మెగాస్టార్ , పవర్ స్టార్ అభిమానులు పాల్గొన్నారు.

# కురుకురే, జంక్‌ఫుడ్‌కు పిల్లలు దూరం!

పోషకాహారమే పిల్లల ఆరోగ్యానికి బలం.. జొన్నగిరి తండాలో పోషణ మాసోత్సవం



**తుగ్గలి, సెప్టెంబర్ 17 ( ప్రభ మనం.న్యూస్):** “మన అంగన్వాడి -- మన బాధ్యత” అనే నినాదంతో తొమ్మిదవ రాష్ట్రీయ పోషణ మాసోత్సవ కార్యక్రమాలు సెప్టెంబర్ 9వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జొన్నగిరి సెక్టార్ పరిధిలోని జొన్నగిరి తండాలో పోషణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శకుంతల పాల్గొని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, సమతుల్య ఆహారం ప్రాముఖ్యతను వివరించారు. పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలకు పోషక విలువలు కలిగిన ఆహారం ఎంతో అవసరమని సూచించారు. అదేవిధంగా పిల్లలను కురుకురే, గోపీ వంటి జంక్‌ఫుడ్‌లకు దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అర్హులైన హక్కుదారులందరూ తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పోషకాహారంపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంచడమే పోషణ మాసోత్సవ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్, హెల్పర్‌తో పాటు జొన్నగిరి తండాకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

# విశాలాక్షి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు





**తుగ్గలి, సెప్టెంబర్ 17 ( ప్రభ మనం న్యూస్):** తుగ్గలి మండలం జి.ఎర్రగుడి గ్రామంలో సీపీఎం నాయకురాలు కనికిరెడ్డి విశాలాక్షి రెండో వర్ధంతి సందర్భంగా గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఆమె సమాధి వద్ద పలువురు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆమె సేవలను స్మరించుకున్నారు. ప్రజల సమస్యల పట్ల స్పందిస్తూ, సామాజిక సేవలో విశాలాక్షి తనదైన ముద్ర వేశారని నాయకులు గుర్తుచేశారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యమయ్యారని పేర్కొన్నారు. ఆమె సేవా స్ఫూర్తిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీకి చెందిన తుగ్గలి రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాతన మోహన్‌రెడ్డి, ఉప్పర్లపల్లి ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, జిట్టా నగేష్‌యాదవ్ తదితరులతో పాటు సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వర్ధంతి సందర్భంగా అన్నదానం విశాలాక్షి వర్ధంతిని పురస్కరించుకుని ఆమె కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆమె సేవలను గుర్తుచేసుకుని ఘనంగా నివాళులర్పించారు.

Office adress....EDITED & PUBLISHED AND OWNED BY.EDITOR : V.LINGAMURTHY. PUBLISHED AT : VSAR PUBLICATION VSAR PUBLICATIONS91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006CONTACT NO :9000367833.RNI,APTEL/26/A 3829,E-MAIL.ID prabhamanam@gmail.com